క్లుప్తంగా

ఓటర్ కార్డుకు ఆధార్ లింక్ చేయించుకోవాలి

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డుకు ఆధార్ లింకేజీ చేయించుకోవాలని అయోధ్యనగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు ఓ ప్రకటనలో కోరారు. బస్తీలోని రామాలయం వద్ద ఉన్న కార్యాలయంలో శనివారం సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు లింకేజీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్‌కార్డుకు ఆధార్ లింకేజీ చేసుకోని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అకాశముందన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గ్రహించాలన్నారు.

టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు పరామర్శ



కాసాని కౌసల్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, మహేందర్‌రెడ్డి

నిజాంపేట్: టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మాతృమూర్తి కాసాని కౌసల్య ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ నేపథ్యంతో శుక్రవారం బాచుపల్లిలోని ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, మహేందర్‌రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

మరుగున పడిన డ్రైనేజీ వ్యవస్థ



మురుగు రోడ్డుపై చేరడంతో శవాన్ని అతికష్టం మీద శ్మశానవాటికకు తరలిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ సూరారంలోని రాజీవ్‌గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ మరుగున పడింది అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. స్థానికంగా 31 బ్లాక్ నుంచి 90 వరకు వెళ్లే రోడ్లో గతంలో వేసిన పాత డ్రైనేజీ తీసేసి కొత్త డ్రైనేజీ మార్గం వేశారు. కానీ వాటి నిర్వహణ నెలల తరబడి చూడకపోవడంతో మురుగు రోడ్ల మీదకు వచ్చి చేరుతోంది. దీంతో నిత్యం ఆ రోడు మురికి కూపంగా మారింది. స్థానికంగా ఓ వ్యక్తి చనిపోవడంతో శ్మశానవాటికకు తరలిస్తున్న క్రమంలో వారి ఎదుర్కొన్న ఇబ్బందులను సోషల్ మీడియాలో పెట్టడంతో హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

డబుల్ ఇళ్లు ఇచ్చేందుకు సర్కార్‌కు మనసు రావడం లేదు



రెవెన్యూ అధికారి మంజులకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను చూసి మురిసిపోవడమే తప్ప పేదలకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మనసు రావడం లేదని బాచుపల్లి ఏరియా ప్రారిశ్రామిక ప్రాంత సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక పిలుపు మేరకు శుక్రవారం బాచుపల్లి, రాజీవ్ గాంధీనగర్, ఇందిరానగర్ బస్తీలలో 59 జీవో సర్వే పూర్తయిన లబ్ధిదారులతో సీఐటీయూ ఆధ్వర్యంలో బాచుపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారి మంజులకు వినతి పత్రం అందజేశారు. జీవో 58, 59ల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచిత పట్టాలు, అదే విధంగా రిజిస్ట్రేషన్‌లు చేస్తానని ప్రకటించిందన్నారు. సర్వే పూర్తయినా ఇంత వరకు హామీని నిలబెట్టకోలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లమ్మ, నీరుడు యాదయ్య, ప్రవీణ్, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు షురూ



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 8వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు ఉత్సవ ఆరంభ స్నపనము, సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాదనం, వాసుదేవ పుణ్యాహవాచనం, అజ్యూరారోపణం తదితర పూజా కార్యక్రమాలు జరుగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త, చైర్మన్ ఠాకూర్ రాజేందర్‌సింగ్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు చేశారు. కాగా స్థానాచార్యులు తిరుమల వెంకటచార్యులు, ప్రధాన అర్చకులు తిరుమల మధుసూదనాచార్యుల నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

విద్యార్థులకు చేయూత.. పేదలకు అండగా

విద్యార్థి దశ నుంచి కష్టకాలంలో ఉన్న తోటి మిత్రులకు సహాయం చేస్తూ.. నిరుపేద విద్యార్థుల భుజం తట్టి అండగా నిలుస్తూ... తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో చిల్లర ఖర్చులు చేయకుండా పేద విద్యార్థులకు చేయూతనిచ్చి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచాడు. దీనికి తోడు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం పుష్కలంగా ఉండడంతో ఏకంగా ఓ ట్రస్ట్‌నే ఏర్పాటు చేశారు. సేవా కార్యక్రమాలతో ఒక్కరితో మొదలైన ప్రయాణంలో మేము భాగస్వాములమవుతామని ప్రస్తుతం వంద మందికి చేరింది. గాజులరామారం చిత్తారమ్మదేవినగర్‌కు చెందిన సొంటిరెడ్డి పున్నారెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌పై ప్రత్యేక కథనం.

– సుభాష్‌నగర్



కరోనా సమయంలో ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇంటర్ విద్యార్థులకు ఎగ్జామ్ ఫీజు చెక్కులను అందజేస్తూ..



తన పుట్టినరోజును విద్యార్థుల సమక్షంలో జరుపుకుంటున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

ప్రస్తావన...

గాజులరామారం డివిజన్ చిత్తారమ్మదేవినగర్ కు చెందిన, వ్యాపారవేత్త సొంటిరెడ్డి పున్నారెడ్డి చిన్నప్పటి నుంచి సేవా కార్యక్రమాలు అంటే ఇష్టం. 2019లో ఎస్‌పీఆర్ ట్రస్టు స్థాపించి, తనకు వచ్చే ఆదాయంలో 10 శాతాన్ని పేదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి తనదైన ముద్ర వేసుకున్నారు.

విద్యకు పెద్దపీట..

తన ట్రస్టులో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. గాజుల రామారం డివిజన్లోని 10 ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులకు ప్రతి ఏటా ఒక్కొక్కరికి పది నోట్ బుక్స్, స్టేషనరీలను ప్రతి ఏటా అందిస్తున్నారు. ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ఫీజ్ కరోనా సమయంలో ట్రస్ట్ భరించింది. ఆర్థికంగా వెనుకబడిన ఇద్దరు విద్యార్థులను ట్రస్టు ద్వారా ఎంబీబీఎస్ ద్వారా చదివిస్తున్నాడు. ఫీజు కట్టలేక చదువు దూరమైనా పలు విద్యార్థులకు ఎస్పీఆర్ ట్రస్టు ముందుకొచ్చి అండగా నిలిచింది.



కరోనా సమయంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

వైద్య శిబిరాలు..

ట్రస్టు ద్వారా ప్రతి ఏటా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి కంటి, చెవ్వు ముక్కు, దంతాలు, గుండెకు సంబంధించిన ఈసీజీ ఉచితంగా చేయించి మందులు పంపిణీ చేస్తున్నారు.

విపత్తుల కాలంలో..

కరోనా, వరదల సమయంలో ట్రస్టు ఆధ్వర్యంలో వలంటీర్లు పనిచేసి పలువురు మన్ననలను పొందారు. మొదటి వేవ్ కరోనా సమయంలో రూ.30 లక్షలతో, రెండోసారి రూ.5 లక్షలతో ప్రజలకు



రమేష్‌ను ఎంబీబీఎస్ చదివించడానికి ముందుకొచ్చిన సొంటిరెడ్డి పున్నారెడ్డి

నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. వరదల సమయంలో పలు పేద కుటుంబాలను, టీచర్లు, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి నిత్యవసర సరుకులను పంచి వారి ఆకలిని తీర్చింది.

ప్రతి పుట్టినరోజుకు..

ఇంట్లో కుటుంబ సభ్యుల పుట్టిన రోజులో అనాథాశ్రమంలో జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రతి ఏటా 3 లక్షలు వెచ్చించి, అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు, క్రీడావస్తుల పంపిణీ, వృద్ధులకు బట్టల పంపిణీ వంటివి చేస్తూ వస్తున్నారు.

మహిళలకు...

మహిళలు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి టైలరింగ్ శిక్షణ ప్రారంభించి 103 కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. నిరుద్యోగులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాలను కల్పించింది.

ట్రస్టు ద్వారా...

ట్రస్టు ద్వారా ఫాకింగ్ మిషిన్ కొనుగోలు చేసి ప్రతిరోజు రెండు బస్తీలకు దోమల బెడద లేకుండా ఫాకింగ్ చేస్తున్నారు. 8 లక్షల వ్యయంతో ఇటీవల మెడికల్ మొబైల్ వ్యాన్ కొనుగోలు చేసి ఉచిత వైద్య శిబిరాలకు, విపత్తు కాలంలో పనిచేయటానికి ఉపయోగిస్తున్నారు.

కాలాన్ని బట్టి...

కాలాన్ని బట్టి పలు సేవా కార్యక్రమాలను ట్రస్టు ముందంజలో చేపడుతుంది. చలికాలంలో ఎప్పటి వరకు వేల సంఖ్యలో దుప్పట్ల పంపిణీ. వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

రాజీ లేకుండా సాయం చేస్తా..



విద్యతోనే అభివృద్ధి సాధ్యం. అందుకు తన వంతు ఎంతైనా సహాయం అందిస్తా. ఎస్పీఆర్ ట్రస్టు ద్వారా సొంతగా స్కూల్ భవనం కట్టించి కార్పొరేట్ దీటుగా విద్యార్థులను తయారు చేయడమే తన లక్ష్యం. ఒకవేళ ప్రభుత్వం స్థలం అప్పగిస్తే తక్షణమే భవన నిర్మాణా పనులను ప్రారంభిస్తాం. ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటుచేసి పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తాం.

– సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఎస్పీఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు

భుజం తట్టి... వెన్నుదన్నుగా నిలిచాడు..



మాది నిరుపేద కుటుంబం. పేదరికంలో పడుతూ లేస్తూ 10 తరగతిలో 9.8 సాధించా. ఇంటర్‌లో 947 మార్కులు సాధించి మండలంలో సెకండ్ ర్యాంకులో నిలిచా. న్యూరాలజిస్ట్ కావాలన్నదే నా లక్ష్యం. ఆర్థిక పరిస్థితి బాగోలేక పై చదువులకు దూరం అవుతున్న క్రమంలో ఎస్ పి ఆర్ ట్రస్టు అండగా నిలిచి నా కల సహకారం చేయడానికి తోడ్పడింది.

– ఎస్.రమేష్, చంద్రగిరినగర్

పేరు రాములు.. జగద్గిరిగుట్టలో ఉంటాడంటా!

తిండి లేక అపస్మారకస్థితిలో వ్యక్తి



సుభాష్‌నగర్: రెండు రోజుల నుంచి ఆహారం లేకుండా ఓ వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో పడిపోయిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సూరారం నుంచి బౌరంపేట వెళ్లే దారి పక్కన ఆ వ్యక్తి పడి ఉండడంతో వాహనదారులకు అనుమానం వచ్చి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 108కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఈఎంటీ రాజు, పైలెట్ శ్రీను అక్కడికి చేరుకోగా ఆ వ్యక్తి కదలని స్థితిలో ఉన్నాడు. అక్కడే సెలైన్లు పెట్టి చికిత్స అందించగా తేరుకున్న సదరు వ్యక్తి తన పేరు రాములు అని, జగద్గిరిగుట్టలో ఉంటానని చెప్పాడు. కాని పూర్తి వివరాలు చెప్పలేకపోతున్నాడని 108 సిబ్బంది పేర్కొన్నారు.

తక్కువ ధరతో కేన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ



మల్లారెడ్డి ఆస్పత్రిలో కేన్సర్ ఫ్రీచెకప్ ప్యాకేజీని ఆవిష్కరిస్తున్న చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి తదితరులు

సుభాష్‌నగర్: ప్రపంచ కేన్సర్ డేను పురస్కరించుకుని శుక్రవారం సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రిలో పేదలకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్‌తో పాటు ఈఐ సర్వైప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పటల్ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి మాట్లాడుతూ కేన్సర్‌ను మొదట్లోనే గుర్తించి చికిత్స చేయడం ఈఐ సర్వైప్ ముఖ్య ఉద్దేశమన్నారు. మల్లారెడ్డి హాస్పిటల్‌లోని కేన్సర్ భాదితులు ఈఐ సర్వైప్ కార్డును పొందితే జీవితకాలానికి 50%, కేన్సర్ నివారణ ఆరోగ్య పరీక్షలకి 15%,ల్యాబ్, రేడియాలజీ, బెడ్ చార్జీలను 10% ప్రతి నెలకోసారి నిర్వహించి డిస్కౌంట్స్ అందిస్తున్నామన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ ప్యాకెజీ 10వేల కంటే ఎక్కువైనా ఒక ప్యాకెజీని కేన్సర్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా పొడగించినట్టు తెలిపారు.

◆ హైదరాబాద్ లోనే ది బెస్ట్ ప్రపంచస్థాయి పరికాలతో కూడిన అత్యాధునిక మిషనరీతో పాటు అంకాలజీ, మల్టీ డిసిప్లీనరీ సూపర్ స్పెషాలటీ డాక్టర్‌లు అందుబాటులో ఉన్నారన్నారు. మల్లారెడ్డి హస్పిటల్ కేన్సర్ బ్లాక్‌లో ప్రతిరోజు 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కేన్సర్ ఒక సంక్లిష్ట వ్యాధిగా మారిందని, దీనికి ముఖ్యంగా ప్రజల జీవనశైలితో పాటు, స్మోకింగ్, మద్యం సేవించడం, టాక్సీన్ పర్యావరణ బహిర్గతం ద్వారా కేన్సర్ ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఈ కేన్సర్ బారిన పడిన వారు అధైర్య పడకుండా ఉండేందుకే తమ మల్లారెడ్డి కేన్సర్ హస్పిటల్‌లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ తమ జీవనశైలిని మార్చుకుని తమతో పాటు తమ కుటుంబాల్లో నిజమైన మార్పును తీసుకురావాలన్నారు.

సత్‌జ్ఞాన్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే



పెద్దల పట్ల గౌరవ మర్యాదలు చూపాలని ఉద్దేశిస్తూ విద్యార్థులు నిర్వహించిన నృత్యప్రదర్శన



గ్రాండ్ పేరెంట్స్‌ను సత్కరిస్తున్న చిన్నారులు

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశం ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలను సత్కరించగా వారు తమ ఆత్మీయ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల త్యాగాలను స్మరిస్తూ ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సత్‌జ్ఞాన్ హైస్కూల్ యాజమాన్యం చిన్నతనం నుంచే నైతిక విలువలతో కూడిన విద్యనందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు.

◆ ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశం మాట్లాడుతూ... నేటి బిజీ ప్రపంచంలో చాలా మంది పెద్దలు ప్రేమానురాగాలకు దూరమవుతున్నారని అన్నారు. చిన్నతనం నుంచి గ్రాండ్ పేరెంట్స్ పట్ల గౌరవం, ఆత్మీయ అనురాగాలను పెంపొందించేందుకు తాము చేసిన చిరు ప్రయత్నమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ ప్రెసిడెంట్ చింతల విజయలక్ష్మి, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ చింతల మహేష్‌కుమార్, నేతాజీ హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ నందిని, సత్‌జ్ఞాన్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ చింతల మానస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



దుండిగల్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలపై శంభీపూర్ రాజు మంత్రి కేటీఆర్‌కు వివరించారు.

◆ ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రాలు అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాపతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



జగద్గిరిగుట్ట: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగద్గిరిగుట్ట సీఐ సైదులు అన్నారు. ఆన్‌లైన్ లోన్‌ల పేరిట జరుగుతున్న మోసాలను వివరిస్తూ డైరెక్టర్ పృథ్వీరాజ్ నిర్మించిన మీనాక్షి షార్ట్‌ఫిల్మ్‌ను శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆన్‌లైన్ మోసాలపై మీనాక్షి లో చక్కగా చూపించారన్నారు. ఇలాంటి సందేశాత్మక షార్ట్‌ఫిల్మ్ ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట పోలీస్ సిబ్బంది, షార్ట్‌ఫిల్మ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు, డబుల్ ఇళ్లు ఇవ్వాలి

నిజాంపేట్: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్‌లను ఇవ్వాలని క్రవారం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రజా సంఘాల పోరాట వేదిక బాచుపల్లి మండల కన్వీనర్ వెంకట రామయ్య, సీఐటీయూ మండల కో.కన్వీనర్ వెంకటరాజ్యం, ప్రజా సంఘాల నాయకుడు వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీరు మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు ఇప్పటి వరకు ఇళ్లను మంజూరు చేయలేదన్నారు. జీవో 58, 59 కింద ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. స్థలాలున్న పేదలకు ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు మల్లికార్జున్, మోహన్‌రెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు.

కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులకు వినతి

సుభాష్‌నగర్: పేదలకు ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని ప్రజా సంఘాల పోరాట వేదిక కుత్బుల్లాపూర్ మండల నాయకుడు పసుల అంజయ్య అన్నారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు మాట్లాడుతూ.. మూడేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం శాంతియుతంగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీవో.58, 59ల కింద 120 గజాల లోపు స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెబితే దరఖాస్తు చేసుకున్న వారికి నేటి వరకు పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్‌లను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండీ సలీమ్, శ్రీనివాస్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనులకు ప్రత్యేక నిధులు



వినాయకనగర్‌లో కొనసాగుతున్న డ్రైనేజీ పనులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధి వినాయకనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొన్ని రోజులుగా స్థానికంగా డ్రైనేజీ సమస్య తలెత్తడంతో ఈ విషయమై స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రత్యేక నిధులు కేటాయించారు. ఎట్టకేలకు డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గొలుసు దొంగ అరెస్టు

నిజాంపేట్: వృద్ధురాలి మెడలో చెయిన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి బంగారు గొలుసును రికవరీ చేసిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మనోజ్‌కుమార్ (26) ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా క్రికెట్ బెట్టింగ్ అలవాటు ఉన్న అతను తెలిసిన వ్యక్తుల నుంచి రూ.5 వడ్డీకి రూ.లక్ష వరకు చేతి బదులు తీసుకుని ఖర్చు చేశాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఇచ్చిన వాళ్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న మనోజ్‌కుమార్ దొంగతనానికి పథకం పన్నాడు.

◆ ఈ క్రమంలో జనవరి 31వ తేదీన ప్రగతినగర్‌లోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన స్వర్ణలత (62) స్థానికంగా ఉన్న సాయిబాబా ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఇళ్ల అద్దెకు ఉన్నాయాంటూ ఆమెను అడిగగా లేదని చెప్పింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌నగర్‌లోని సిరి బాలాజీ అపార్ట్‌మెంట్‌లోని తన ఫ్లాట్‌లోకి వెళ్లేందుకు వృద్ధురాలు లిఫ్ట్ ఎక్కగా ఎవరూ లేరని గ్రహించిన మనోజ్‌కుమార్ బలవంతంగా ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు.

◆ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా మనోజ్‌కుమార్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి 25 గ్రాముల బంగారు గొలుసుతో పాటు గతంలో మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ చేసిన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రైనేజీ పొంగిపొర్లుడు.. పైప్‌లైన్ లీకేజీలు షరామామూలే.!

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్డుపై ఒక వైపు మురుగు ప్రవాహం.. మరో వైపు మరమ్మతుల కోసం తీసిన గుంత వాహనదారులకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్ గాంధీనగర్– జగద్గిరిగుట్ట రోడ్డులో ఇటీవల 600 ఎంఎం పైపులైన్‌కు లీకేజీ తలెత్తడంతో జలమండలి అధికారుల ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ రెండు రోజుల క్రితం గుంత తీసి మరమ్మతులు పూర్తి చేసి పూడ్చకుండా చేతులు దులుపుకున్నాడు. దీంతో ఓ వైపు తీసిన గుంతలో నిత్యం సిటీ బస్సులు, జిల్లా సర్వీసులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలతో బిజీగా ఉండే ఈ రోడ్డులో ట్రాఫిక్ జామ్ తలెత్తుతోంది. దీనికి తోడు గుంత సమీపంలోనే డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగిపొర్లడంతో రోడ్డుపై పెద్ద మొత్తంలో మురుగు వచ్చి చేరింది. అసలే గుంతలమయంగా ఉన్న రోడ్డులో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి వేళల్లో, ట్రాఫిక్ సమయంలో వాహనదారుల ఇక్కట్లు చెప్పలేనివిగా ఉంటున్నాయి.

– రోడ్డుపై మురుగు చేరడంతో సమీపంలోని ఇళ్ల వాసులు, దుకాణదారులు దుర్గంధం భరించలేక పోతున్నారు. తాగునీటి పైపులైన్ల నిర్వహణతో పాటు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే సీవరేజీ లైన్ల నిర్వహణ సైతం జలమండలికి బదలాయించిన విషయం తెలిసిందే. అయితే కాంట్రాక్టర్లు, కిందిస్థాయి సిబ్బందిపై జలమండలి అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో జంట సర్కిళ్ల పరిధిలో ఎక్కడ చూసినా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలు షరామాములుగా మారాయి. జలమండలి రెండెద్దుల సవారీతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై సాక్షి సంబంధిత జలమండలి ఏఈ పూజితను వివరణ కోరేందుకు సంప్రదించక ఎంతకీ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.



సంజయ్‌గాంధీ నగర్-జగద్గిరిగుట్ట రోడ్డులో చేరిన మురుగునీరు. (మరో వైపు తాగునీటి పైపులైన్ మరమ్మతులకు తీసిన గుంత)